Eenadu

ఈనాడు

29-03-2011

Page # 10



అవార్డు అందజేస్తున్న దృశ్యం

# విజయానికి క్రమశిక్షణే సోపానం

**చెన్నై, న్యూస్‌టుడే:** ఉన్నత శిఖరాలకు చేరుకోవడానికి క్రమశిక్షణ ముఖ్యమని నాటి పరుగుల రాణి పద్మశ్రీ పీటీ ఉష విద్యార్థులకు ఉద్బోధించారు. సోమవారం ఎస్ఎస్ఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన వార్షిక క్రీడోత్సవాలకు ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాంత్రికంగా చదువుకుంటూ పోతే ఆశించిన స్థాయిలో ఏ ఒక్కటీ సాధించలేమని తెలిపారు. విద్య, క్రీడలు, కళలు వంటి అన్ని రంగాలలోనూ అంకిత భావంతో కూడిన క్రమశిక్షణ, మనోధైర్యం అవసరమని అన్నారు. దేశ ప్రగతి యువత ప్రతిభతోనే ముడిపడి ఉన్న తరుణంలో విద్యార్థులు క్రమశిక్షణపై దృష్టిసారిస్తే విజయావకాశాలకు లోటు ఉండదన్నారు. కార్యక్రమంలో కళాశాల సంచాలకులు శ్రీనివాసన్, ప్రిన్సిపాల్ శాలివాహనన్ తదితరులు ప్రసంగించారు. చెస్ పోటీలలో విజయం సాధించిన విద్యార్థి అభయ్‌కు ఉష ప్రత్యేక అవార్డు అందించారు.